సాక్షి అనకాపల్లి

మంగళవారం । 15 । జూలై । 2025



నిరసనలు, ఆందోళనలు

పదే పదే ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 8లో



మాడుగులలో భారీ చోరీ

ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి 19.5 తులాల బంగారం, రూ.1.90 లక్షల నగదు దోచుకుపోయారు. 8లో



పుస్తకావిష్కరణ

సీతంపేట: పతివాడ నాస్తిక్ రచించిన 'కొలిమి రాజెయ్యాల్సిందే' అనే పుస్తకాన్ని విశాఖలో ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానం

యలమంచిలి రూరల్: జిల్లాలో వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలి వినోద్‌బాబు తెలిపారు. జిల్లాలో వి.మాడుగుల, దేవరాపల్లి కాలేజీల్లో కెమిస్ట్రీ, దేవరాపల్లి, కోటవురట్ల ప్రభుత్వ కాలేజీల్లో ఈటీ (ఒకేషనల్), చోడవరం ప్రభుత్వ కాలేజీలో ఏ అండ్ టీ (ఒకేషనల్), సబ్బవరం ప్రభుత్వ కాలేజీలో ఫిజియోథెరపీ (ఒకేషనల్) పోస్టులకు అతిథి అధ్యాపకులను నియమించనున్నట్టు చెప్పారు. గతంలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసినవారు, విశ్రాంత స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత సబ్జెక్టు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక ప్రతి జిరాక్స్ కాపీలను ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు అందజేయాలన్నారు. అనంతరం ఈనెల 17వ తేదీన అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ఇద్దరిని రక్షించిన మెరైన్ పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవల్లిక, రమణి

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో సోమవారం స్నానం కోసం సముద్రంలో దిగిన మునిగిపోతున్న మహిళలను ఒడ్డున ఉన్న మెరైన్ పోలీసులు రక్షించి ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. యలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన రాజాన రమణి, పోతిరెడ్డి పవల్లిక సముద్ర స్నానం కోసం తీరానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా కెరటాలకు లోపలికి కొట్టుకుపోయారు. మెరైన్ పోలీసు యర్రి అప్పలరాజు గుర్తించి కేకలు వేసి స్థానిక మత్స్యకారుల సహాయంతో ఇద్దరినీ ప్రాణాలతో ఒడ్డుకు చేర్చారు. అప్పటికే నీరు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న వారికి ప్రాథమిక చికిత్స అందించి నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాణాపాయ స్థితి తప్పిందని ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

సబ్బవరం: విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 16న తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయాధికారి ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు ఉదయం 9 గంటల నుంచి, బాలికలకు మధ్యాహ్నం 1 గంట నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, శ్రీకృష్ణాపురంలోని బాలుర గురుకులాలు, మేహాద్రిగెడ్డ, సీహోఈ, నక్కపల్లి, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి బాలికల గురుకులాల్లో ఖాళీల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

వడ్డీలు.. చిట్టీలు..

సామాన్యులను ముంచేస్తున్న ఆర్థిక నేరగాళ్లు

- అమాయకులే లక్ష్యంగా అధిక వడ్డీ పేరిట ఎర
- ఆపై అనధికార చిట్టీల నిర్వహణ
- ప్రజల కష్టార్జితాన్ని రూ.కోట్లలో కొల్లగొడుతున్న మాయగాళ్లు
- జిల్లాలో వరుసగా వెలుగు చూస్తున్న ఘరానా మోసాలు
- పోలీస్ స్టేషన్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితులు

అవసరానికి అక్కరకొస్తుందని రూపాయి రూపాయి కూడబెట్టి చిట్టీలు వేసిన సామాన్యులు.. వడ్డీ ఎక్కువొస్తుందని ఆశపడి బడా బాబుల చేతుల్లో తమ కష్టార్జితాన్ని ఉంచిన అమాయకులు లబోదిబోమంటున్నారు. పిల్లల చదువు కోసం దాచుకున్న డబ్బులు కొందరివైతే.. కూలీ నాలీ చేసి కూడబెట్టిన సొమ్ములు మరికొందరివి. ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ. ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్న వారిని నమ్మి నిలువునా మోసపోతున్న ఉదంతాలు ఈమధ్య జిల్లాలో ఎక్కువయ్యాయి.

యలమంచిలి రూరల్:

అతనో టీడీపీ నేత. 15 ఏళ్లకు పైగా యలమంచిలి మున్సిపాలిటీ తెరువుపల్లిలో పాల సేకరణ కేంద్రంలో వేతన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అమాయక ప్రజలందరినీ నమ్మించి వడ్డీ ఆశ చూపాడు. సుమారు 300 మంది నుంచి రూ.4.30 కోట్లు అప్పులు, చిట్టీల రూపంలో వసూలు చేశాడు. ఆ టీడీపీ నేత పేరు దాడిశెట్టి పైడియ్య (నానాజీ). మొదట్లో వడ్డీ సక్రమంగా చెల్లించడంతో ఆశ పడిన జనం దాచుకున్న సొమ్ముతోపాటు ఇళ్లు, బంగారం తనఖా పెట్టి మరీ కోట్లలో అప్పుగా ఇచ్చారు. ఆయన ఫోర్జరీ సంతకాలతో రాసిచ్చిన ప్రామిసరీ నోట్లను దగ్గర పెట్టుకొని తమ సొమ్ము భద్రంగా ఉందని ధీమాగా ఉన్నారు. చివరకు ఆ నాయకుడు కుటుంబంతో సహా గ్రామం నుంచి పరారవడంతో దారుణంగా మోసపోయామని తెలుసుకొని లబోదిబోమంటూ యలమంచిలి రూరల్ పోలీసుకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని గత రెండు వారాలుగా కాళ్లరిగేలా తిరుగుతున్నారు.



యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద న్యాయం కోసం వచ్చిన తెరువుపల్లి మహిళలు

- పాయకరావుపేటకు చెందిన వ్యాపారి పెదిరెడ్డి వెంకటేశ్వర్రావు అదే మండలంలోని సత్యవరం గ్రామంలో గత 30 ఏళ్లుగా కుటుంబంతో నివాసముంటున్నాడు. తునిలో నగల దుకాణం, వస్త్ర దుకాణం నడిపేవాడు. పలువురితో పరిచయాలు పెంచుకుని సుమారు రూ.20 కోట్లు ప్రజల నుంచి అప్పుగా తీసుకుని కుటుంబంతో సహా పరారయ్యాడు. వ్యాపారి ఇచ్చిన ప్రామిసరీ నోట్లను చూపుతూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.
- కె.కోటపాడు మండలం చౌడువాడకు చెందిన పద్మజ అనధికారికంగా చిట్టీలు నిర్వహిస్తూ **సుమారు రూ.4 కోట్లకు** పైగా పలువురి వద్ద నుంచి **వసూలు చేసింది. అదను** చూసి పరారవడంతో **చిట్టీలు కట్టిన వారంతా** లబోదిబోమంటున్నారు. **స్థానిక పోలీసులకు ఫిర్యాదు** చేయడంతో కేసు **నమోదు చేశారు.**

ఇవన్నీ నెల రోజుల వ్యవధిలో బయటపడిన **ఫైనాన్స్ మోసాలు. అ**మాయకులే లక్ష్యంగా.. **నమ్మకమే పెట్టుబడిగా త**మకున్న పరిచయాలతో **దొరికినవారినల్లా నిలువు**నా మోసగించారు కేటు**గాళ్లు. మోసం బయటప**డే సమయానికి నగదు, **బంగారం తీసుకొని కుటు**ంబంతో సహా ఎవ్వరికీ **దొరక్కుండా పరారయ్యా**రు. అనధికార చిట్టీలను నిర్వహించడం, వడ్డీ ఆశ చూపి పెద్ద మొత్తంలో డబ్బు సేకరణ చట్టరీత్యా నేరం. అయినప్పటికీ జనం నమ్మకాన్ని ఆసరాగా చేసుకుంటున్న మోసగాళ్లు వీలైనంత ఎక్కువ మందికి కుచ్చుటోపీ పెట్టి దర్జాగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. వారాల తరబడి ఆర్థిక నేరగాళ్లను పట్టుకోకుండా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

దీనిని ఆసరాగా చేసుకుంటున్న మరికొందరు అమాయక ప్రజలను మోసగించకముందే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. మరోవైపు ఇలాంటి మోసాలు నిత్యం వెలుగుచూస్తున్నా ప్రజల్లో సైతం మార్పు రావడంలేదు. అమాయకత్వం, అతివిశ్వాసం, వడ్డీ డబ్బుకు ఆశతో సర్వస్వం మోసగాళ్ల చేతిలో పెట్టి అంతా అయిపోయాక లబోదిబోమంటున్నారు. జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఆర్థిక నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అనుమతి లేని చిట్టీల నిర్వాహకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, ఫైనాన్షియల్ ప్లానర్లు సూచిస్తున్నారు.

నెలాఖరుకు ఇస్తానన్నాడు.. కనిపించకుండా పోయాడు



చమటోడ్చి కష్టపడి పోగు చేసిన రూ.2.5 లక్షలు దాడిశెట్టి పైడియ్యకు అప్పుగా ఇచ్చా. మరో లక్ష రూపాయల చీటీ 18 నెలలుగా కడుతున్నాను. మొత్తం రూ.3.5 లక్షల వరకు ఇవ్వాల్సి వుంది. నా భర్త అడిగితే ఈ నెలాఖరుకు మొత్తం ఇచ్చేస్తానని చెప్పి కనిపించకుండా పోయాడు. 20 రోజుల నుంచి పోలీసుల చుట్టూ తిరుగుతున్నాం.

–దాసరి వెంకటలక్ష్మి, తెరువుపల్లి

చేతిలో రూపాయి లేదు.. రోజులెలా గడుస్తాయో



నా భర్త చనిపోయాడు. కూలి పని చేసుకుంటూ రూ.2 లక్షల కష్టార్జితాన్ని బ్యాంకులో దాచుకుందామనుకుంటే దాడిశెట్టి పైడియ్య.. ఎందుకమ్మా నేను అంతకంటే ఎక్కువ వడ్డీ ఇస్తానని నమ్మిస్తే ఆ డబ్బు ఇచ్చాను. చేతిలో రూపాయి లేదు. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ఇంత నమ్మకద్రోహం చేస్తాడనుకోలేదు.

–పిల్లా చిలుకమ్మ, తెరువుపల్లి

మా ఆడబొట్టు డబ్బు రూ.5 లక్షలు కూడా ఇచ్చాను



నేను చీటీలు, అప్పు రూపంలో రూ.3.5 లక్షలు ఇవ్వడంతోపాటు నా ఆడపడుచు బ్యాంకులో దాచుకున్న రూ.5 లక్షలు కూడా దాడిశెట్టి పైడియ్యకు ఇచ్చాను. ఎంతో నమ్మించి వంచించాడు. నా జీవితంలో అలాంటి వ్యక్తిని చూడలేదు. ఇంట్లో ఎవరికీ తెలీకుండా డబ్బు ఇచ్చాను. బయట తిరగలేకపోతున్నాను.

–పిల్లా నాగమణి, తెరువుపల్లి

ఆడపిల్లల చదువు కోసం దాచుకున్నాను



నాకు ముగ్గురు ఆడపిల్లలు. నా భర్తకు అనారోగ్యం. పదేళ్లు కష్టపడి సంపాదించిన రూ.4 లక్షలు దాడిశెట్టి పైడియ్యపై నమ్మకంతో అప్పుగా ఇచ్చాను. నెల నెలా వడ్డీ ఇస్తానని నమ్మబలకడంతో ఆడపిల్లల చదువు కోసం దాచుకున్న సొమ్ము ఇచ్చి మోసపోయాను. పేద కుటుంబాలను దగా చేయడం దారుణం.

–బోజా అమ్మాజీ, తెరువుపల్లి

కూటమిలో కోడి కుంపటి

- ఫ్లోర్ లీడర్ ఇవ్వకుండా తెరవెనుక కుట్రలంటూ కార్పొరేటర్ గంధం మండిపాటు
- కోడి వ్యర్థాల తరలింపులో బెదిరించి మరీ పేర్ల ప్రస్తావించారంటూ ఆగ్రహం
- సొంత పార్టీ నేతలే కారణమంటూ ఫైర్
- మేయర్ వ్యవహారంపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న కార్పొరేటర్లు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కోడి వ్యర్థాల అక్రమ రవాణా వ్యవహారం కూటమి నేతల్లో చిచ్చురేపుతోంది. మేయర్ పీఠాన్ని అధిష్టించి మూడు నెలలు కాకముందే ఏకంగా మంట పుట్టిస్తోంది. కుట్రలకు తెరతీస్తూ కొత్త చర్చకు దారితీస్తోంది. ఒకవైపు జనసేన ఎమ్మెల్యే, మరోవైపు టీడీపీ మాజీ ఎమ్మెల్యేతో పాటు జోన్‌కు ఒక కార్పొరేటర్ కీలకంగా వ్యవహరిస్తూ కొన్నాళ్లుగా కోడి వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్నారు. వారిలో సఖ్యత కుదరక రోజుకు ఒక వాహనాన్ని పోటీపడీ మరీ పట్టిస్తున్నారు. తాజాగా అనకాపల్లి వద్ద కోడి వ్యర్థాలను తరలిస్తున్న లారీలను అధికారులు పట్టుకోగా.. వాహన డ్రైవర్ కాస్తా గంధం శ్రీనుతో పాటు జీవీఎంసీ అధికారి పేరును ప్రస్తావించడంతో వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు ఫ్లోర్ లీడర్ పోస్టు రాకూడదనే సొంత పార్టీ నేతలే ఈ విధంగా తనను భ్రష్టుపట్టిస్తున్నారంటూ టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీను వాపోతుండటం విశేషం. డిప్యూటీ మేయర్ పోస్టు ఆశించిన గంధం శ్రీనుకు చివరి క్షణం వరకూ ఆశలు రేపి తుస్సుమనిపించారు. ఇప్పుడు జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడరు పోస్టును ఆశిస్తున్నారు. దీనిపై ఇన్ని రోజులుగా నాన్చుతూ వచ్చి.. ఇప్పుడు పూర్తిగా తప్పించేందుకే కోడి వ్యర్థాల తరలింపులో పేరు వచ్చే విధంగా చేశారని తన సన్నిహితుల వద్ద ఆయన వాపోయినట్టు సమాచారం. ఈ కుట్రలో స్వయగా మేయర్ పాత్ర ఉందని కూడా ఆయన చెబుతున్నట్టు విశ్వసనీయవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరిపించాలని.. అసలైన కుట్రదారులెవరో బయటపడాలని కూటమి పార్టీల కార్పొరేటర్లతో పాటు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పట్టుబడుతున్నారు.

సబ్బవరం వద్ద మరో వాహనం పట్టివేత

ఈ వ్యవహారం ఒకవైపు నడుస్తుండగా తాజాగా జోన్–2 నుంచి కోడి వ్యర్థాలను తరలిస్తున్న ఏపీ39వీసీ3118 బొలెరో వాహనాన్ని సబ్బవరం వద్ద పట్టుకున్నారు. ఈ వాహనంపై ఫిర్యాదు కూడా చేసినప్పటికీ తప్పించడం గమనార్హం. జూన్ 11వ తేదీన ఇదే వాహనాన్ని మూర్తియాదవ్ చిన్నవాల్తేరు వద్ద పట్టుకుని జీవీఎంసీ అధికారులకు అప్పగించారు. ఇప్పుడు అదే వాహనం మళ్లీ దర్జాగా రోడ్లపై తిరుగుతోంది.



పార్కు స్థలాల విషయంలోనూ..!

జీవీఎంసీకి చెందిన పార్కు స్థలాల వ్యవహారంలో ప్రతీ విషయంపై తనకు సమాచారం కావాలని రెండు రోజుల క్రితం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మరీ మేయర్ ఆదేశాలు జారీచేశారు. ఇందుకు సంబంధించిన అన్ని రికార్డులూ తన ముందు ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ వివరాలన్నీ తనకు పరోక్షంగా సహకరిస్తున్న జనసేన కార్పొరేటరుకు చేరవేసి.. రచ్చ చేయడం ద్వారా దండుకోవాలని పక్కాగా ప్లానింగ్ చేస్తున్నారని కూడా సొంత పార్టీ కార్పొరేటర్లు గుసగుసలాడుకుంటున్నారు. ఈ వ్యవహారంలో మేయర్ పాత్రపై కూడా అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు కూటమి కార్పొరేటర్లు కొందరు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇప్పటికే మేయర్‌కు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి మధ్య పార్టీ సమావేశం సాక్షిగా మాటల యుద్ధం నడిచింది. మొత్తానికి కూటమి పార్టీలోని కార్పొరేటర్లు, నేతలకు.. మేయర్ వర్గానికి మధ్య మొదలైన ఈ రచ్చ కాస్తా ఏ తీరాలకు చేరుతుందనేది త్వరలో తేటతెల్లం కానుంది.

కలిసిమెలిసి.. కుట్రలకు తెరలేపి..!

వాస్తవానికి పీలా శ్రీనివాసరావుతో పాటు గంధం శ్రీను, కార్పొరేటర్ శ్రీనులు కలిసిమెలిసి ఉండేవారు. స్టాండింగ్ కమిటీ వ్యవహారాలతో పాటు ఇతర పనుల విషయాల్లోనే వీరి ద్వారానే మేయర్ పనులు కానిచ్చారు. ఇప్పుడు వీరి మధ్య విభేదాలు మొదలైనట్టు సమాచారం. ఇందులో భాగంగానే డిప్యూటీ మేయర్ పోస్టు రాకుండా తనను అడ్డుకున్నారని గంధం శ్రీను అప్పట్లో వాపోయారు. ఈ వ్యవహారంలో జనసేనకు వచ్చేలా పట్టుబట్టాలని ఆ పార్టీ కార్పొరేటరు పీతల మూర్తి యాదవ్‌ను స్వయంగా మేయర్ ఎగదోశారని కూడా టీడీపీ కార్పొరేటర్లు మండిపడుతున్నారు. మేయర్ పీఠాన్ని ఎక్కిన తర్వాత పీలా శ్రీనివాసరావు వ్యవహారశైలి మారిపోయిందని సొంత పార్టీ నేతలే విమర్శలు గుప్పిస్తున్నారు. వాహన డ్రైవర్లను బెదిరించి తనతో పాటు మరికొందరు నేతల పేర్లను బలవంతంగా చెప్పించారని గంధం శ్రీను తన సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కూడా కూటమి నేతలే డిమాండ్ చేస్తుండటం గమనార్హం. కొద్దిరోజుల క్రితం గాజువాక ప్రాంతంలో 4419 నెంబరు గల బొలెరో వాహనాన్ని స్వయంగా గంధం శ్రీను పట్టించడంతో ఈ రచ్చ కాస్తా ప్రారంభమైనట్టు తెలుస్తోంది.

కానిస్టేబుల్ ఫలితాల్లో నానాజీ ప్రతిభ



నానాజీని సత్కరిస్తున్న నాయకులు

అచ్యుతాపురం రూరల్: దొప్పెర్ల గ్రామానికి చెందిన గండి నానాజీ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటుకున్నారు. టాప్ ర్యాంకు సాధించిన ఆయనను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. నానాజీ తల్లిదండ్రులు అయ్యబాబు, జయమ్మ వ్యవసాయ కూలీలు. వారి కలలను నిజం చేస్తూ నానాజీ 200 మార్కులకు 168 సాధించి రాష్ట్రంలోనే ప్రథముడిగా నిలిచారు. ఆయనను వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు బండారు రమణ, పార్టీ మండల నాయకుడు నడిపింటి శేఖర్ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. మట్టిలో మాణిక్యంలా మెరవాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి దేశానికి గర్వకారణం కావాలని మండల యువజన అధ్యక్షుడు కారుకుండి శ్రీను ఆకాంక్షించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

అనకాపల్లి టౌన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీలోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపించాలని, ఈ అవకాశాన్ని ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కోరారు.

మా పిల్లలకు చదువు చెప్పండి సారూ..8లో

గ్రామాలపై వేటు.. కాలుష్యం కాటు

- బల్క్‌డ్రగ్ పార్కుకు భూములు ఇవ్వలేం
- గుర్రాజుపేట గ్రామసభలో రైతుల స్పష్టీకరణ



రసాయన పరిశ్రమలు వద్దని ఎస్‌డీసీకి వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఎస్.రాయవరం: రసాయనాలు వెదజల్లే కంపెనీలు పెట్టి కోనసీమలాంటి తమ ప్రాంతాన్ని కలుషితం చేయవద్దని గుర్రాజుపేట రైతులు వేడుకున్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, పర్యావరణ సమతుల్యత పాటించే పరిశ్రమలు పెడితే స్వచ్ఛందంగా భూములిస్తామని వారు అధికారులకు స్పష్టం చేశారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల మధ్యలో గల 800 ఎకరాలు సేకరించి, బల్క్ డ్రగ్ పార్కుకు కేటాయించేందుకు గుర్రాజుపేట గ్రామ సచివాలయంలో రైతులతో సోమవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్ అనిత రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. బల్క్‌డ్రగ్ పార్కును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని, అలా చేస్తే పంటలు కోల్పోతామని, గ్రామంలో నివాసం కూడా ఉండలేమని రైతులు స్పష్టం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏర్పాటు చేసిన హెటిరో డ్రగ్స్ కంపెనీ వల్ల ఇప్పటికే చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎస్‌డీసీ అనిత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పరిశ్రమల ఏర్పాటుకు భూ సేకరణ జరుగుతోందని, తాము రైతులు, ఈ ప్రాంతవాసుల అభిప్రాయాలు తీసుకుని కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. తమ అభ్యంతరాలను వివరిస్తూ రైతులు ఎస్‌డీసీకి వినతి పత్రం అందజేశారు. ఈ గ్రామ సభలో సర్పంచ్ రత్నం, ఉప సర్పంచ్ దాట్ల రాజానరాజు, నాయకులు రామురాజు, రైతులు తహసీల్దార్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నా ప్రాణం తీసుకున్నట్టే..



నేను ప్రయోగాత్మకంగా కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్స్ పండిస్తున్నాను. నా భూమి తీసుకుంటున్నట్టు అధికారులు చెప్పారు. నా భూమి తీసుకుంటే నా ప్రాణం తీసుకున్నట్టే. ఎంతో ఇష్టంగా ఆదర్శనీయంగా సాగు చేస్తున్నాను. నేను ఇటువంటి పరిశ్రమలకు భూమి ఇవ్వలేను. – ఉపాధ్యాయుల నరసింహమూర్తి, గుర్రాజుపేట, ఎస్.రాయవరం మండలం

తప్పదంటే పూర్తిగా తీసుకోండి



రసాయన పరిశ్రమల ఏర్పాటు వద్దు. ఆ పరిశ్రమలు పెడితే భూములతోపాటు ఇళ్లు కూడా వదిలి పోవాల్సివస్తుంది. తప్పదంటే ఒక రైతు భూమి పూర్తిగా తీసుకోవాలి. కొంత తీసుకుంటే మిగిలిన భూమితో వ్యవసాయం చేయలేము.

–లక్ష్మీపతిరాజు, గుర్రాజుపేట

మొత్తం గ్రామాన్ని తరలిస్తేనే..



మా ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ వద్దు. గుర్రాజుపేటలో 172 ఎకరాలు తీసుకుంటామంటున్నారు. అందుకు ఒప్పుకోం. మా గ్రామంలో మొత్తం 3 వేల ఎకరాల భూమి ఉంది. ఒకవేళ తీసుకోక తప్పదంటే ఈ మొత్తం భూమిని తీసుకొని మా గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలించండి.

–శ్రీనురాజు, రైతు, గుర్రాజుపేట

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయానికి 40 అర్జీలు



అర్జీదారుల సమస్యలను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌కు 40 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల నుంచి ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ వంటి వాటిపై అర్జీలు వచ్చాయన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా పోలీసు స్టేషన్ల ఎస్‌ఐలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాటిపల్లిలో పారిశ్రామిక అవసరాల కోసం సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: పాటిపల్లి పంచాయతీ పరిధిలో పారిశ్రామిక అవసరాల కోసం సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ పి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం పాటిపల్లి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్లు 79, 112, 113లో ఉన్న సుమారు 600 ఎకరాల భూమిని వారం రోజులపాటు సర్వే చేస్తామన్నారు. ఆయా సర్వే నెంబర్ల పరిధిలోని రైతులు తమ పట్టాదారు పుస్తకాలతో అందుబాటులో ఉండాలన్నారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వివిధ కళాశాలల విద్యార్థులు

నర్సీపట్నం: ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు భారీ ప్రదర్శన, ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్, డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ మాట్లాడుతూ రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక విద్యార్థులు ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. హాస్టళ్లకు సొంత భవనాలు కల్పించాలన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్స్ వెంటనే కల్పించాలన్నారు. శివపురంలో ఎక్కువగా హాస్టల్స్, కాలేజీలు ఉన్నందున విద్యార్థుల రక్షణ నిమిత్తం పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో 700 మంది విద్యార్థులు, నాయకులు వికాస్, సందీప్ గురూజీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నిరసనలు, ఆందోళనలు

- పదే పదే ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం
- అధికారుల తీరుపై అర్జీదారుల అసహనం
- పీజీఆర్ఎస్‌కు 309 అర్జీలు

తుమ్మపాల: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతుల పరిష్కారంపై పలువురు అర్జీదారులు అధికారులను ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై ఎటువంటి పరిష్కారం లేదని, భూముల ఆక్రమణ, రికార్డుల మార్పులపై ఫిర్యాదులు చేసినప్పటికి నిలువరించే పరిస్థితులపై అధికారులు కనీసం చొరవ చూపడం లేదని పలువురు అర్జీదారులు వాపోయారు. కలెక్టర్ విజయ కృష్ణన్ లేకపోవడంతో పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అధికారుల్లో కొన్ని శాఖల అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా హామీలు పరిష్కారం లభించడం లేదంటూ కలెక్టరేట్ గేటు వద్ద పలు శాఖల సిబ్బందితోపాటు వివిధ వర్గాల ప్రజలు మండుటెండలో సైతం వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. అనుమతులు తీసుకున్న వారికి తప్ప ఇతరులు నిరసనలు చేసేందుకు పోలీసులు అంగీకరించకపోవడంతో పలువురి అసహనం వ్యక్తం చేశారు. అయినప్పటికీ పలు సమస్యలపై ఉపాధి కూలీలు, వెలుగు వీవోఏలు, భూసేకరణ బాధితులు, ల్యాండ్ పూలింగ్ రైతులు, కల్లు గీత కార్మికుల నిరసనలు, ఆందోళనలతో కలెక్టరేట్ వేడెక్కింది.

- పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టరేట్ వేదికగా డీఆర్వో వై.సత్యనారాయణరావు, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వై.శ్రీనివాస్ అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకుని గడువులోగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి సమస్యలపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ వారం పీజీఆర్ఎస్‌లో మొత్తం 309 అర్జీలు నమోదయ్యాయి. పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు

ఈ వారం వచ్చిన అర్జీల్లో కొన్ని...

1) డీ-పట్టా భూములను ఆన్‌లైన్ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా చూడాలని కోరుతూ ఎస్.రాయవరం మండలం పెద్దగుమ్మలూరు దళిత రైతులు వినతి సమర్పించారు.

2) శతశాతం వికలాంగత్వం ఆధారంగా రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలంటూ వి.మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు మెండేపు గోవింద పీజీఆర్ఎస్‌లో విన్నవించుకున్నాడు.

3) ఉపాధి హామీ పథకం కింద చెరువులో నాటిన కొబ్బరి మొక్కల పెంపకానికి కూలి చెల్లించకుండా టెక్నికల్ అసిస్టెంట్ ఆనందరావు దోచుకుని తమకు తీవ్ర అన్యాయం చేశారు. అతనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వద్దాది గ్రామానికి చెందిన దివ్యాంగ వేతనదారులు లంక బాలకృష్ణ, మామిడి అప్పలకొండ కోరారు. గ్రామంలో మూడెకరాల ప్రభుత్వ భూమిలో కొబ్బరి మొక్కలు నాటి వాటి పెంపకం బాధ్యతలు తమకు అప్పగించారన్నారు.

4) వెలుగు విభాగంలో పనిచేస్తున్న వీవోఏలకు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ వెలుగు వీవోఏ సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. పీజీఆర్ఎస్‌లో సంబంధిత ఉద్యోగులు వినతి పత్రం సమర్పించారు.

నాలుగు రెట్లు పరిహారం చెల్లించాలని సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్వాసితుల నిరసన



కలెక్టరేట్ వద్ద నల్లరేగులపాలెం రైతుల నిరసన ప్రదర్శన

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి జాబితాలో తప్పులను సవరణ చేసి, బహిరంగ మార్కెట్ విలువకు నాలుగు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సబ్బవరం మండలం నల్లరేగులపాలెం గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రైతుల నుంచి సేకరిస్తున్న మెట్ట భూములను పల్లం భూములుగా నమోదు చేశారన్నారు. దాంతో తక్కువ నష్టపరిహారం నమోదైందని, పూర్వ కాలంగా సాగుచేసుకుంటున్న బంజరు భూములకు నష్టపరిహారం మంజూరు చేయాలని డీఆర్వోకు రైతు సంఘం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్‌తో పాటు రైతులు వినతిపత్రం అందించారు.

ఉపాధి పనుల్లో కుల వివక్ష.. టీఏ తీరుపై దళిత మహిళల నిరసన



ఉపాధి హామీ పథకం టీఏ తీరుపై వద్దాది గ్రామ వేతనదారుల నిరసన

కులాల ప్రాతిపదికన ఉపాధి పనులు కల్పించడంతో తమకు తక్కువ వేతనం వస్తుందని, టీఏ వి.రమణపై విచారణ చేసి న్యాయం చేయాలంటూ బుచ్చెయ్యపేట మండలం వద్దాది గ్రామానికి చెందిన దళిత మహిళలు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు భూసి కోటి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన చేశారు. ప్రభుత్వం కల్పించిన క్యూబిక్ మీటర్ లెక్కలు కాకుండా అధికంగా పనిచేయిస్తూ మండుటెండల్లో సైతం మహిళా దళిత కూలీలను ఉంచుతున్నారని వాపోయారు. చేసిన పనికి సరైన వేతనం దక్కకుండా చేస్తున్నారన్నారు. అతని తీరుపై మండల స్థాయి అధికారులు వచ్చి మందలించారని, అయినా మార్పు లేదని వాపోయారు. అతని తీరుపై ప్రశ్నించినందుకు వారం రోజుల పాటు 196 మంది వేతనదారులకు పని నిలిపివేసి రకరకాల సాకులతో ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు విచారణ చేపట్టి అతనిపై చర్యలు తీసుకుని, సరైన వేతనం చెల్లించాలని కోరారు.

వీధి దీపాల మాదిరిగా బెల్టు దుకాణాలు



బెల్టు దుకాణాలు రద్దు చేయాలంటూ ఆందోళన చేస్తున్న కల్లు గీత కార్మికులు

- మా పొట్ట కొట్టొద్దని కల్లు గీత కార్మికుల ఆందోళన

వీధి దీపాల మాదిరిగా విస్తరించిన బెల్ట్ షాపులను తక్షణమే నిలిపివేసి కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గీత కార్మికులు కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామాల్లో కళకళలాడే కల్లు దుకాణాలు పోయి కూటమి ప్రభుత్వంలో బెల్టు దుకాణాల ద్వారా కల్తీ మద్యం ఏరులై పారుతుందని విమర్శించారు. జిల్లాలో 3 వేల బెల్టు షాపుల ద్వారా గోవా, యానాం మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపించారు. వృత్తిని నమ్ముకుని ప్రాణాలకు తెగించి చెట్లు ఎక్కుతూ కుటుంబాలను పోషించుకుంటున్న గీత కార్మికుల పొట్ట కొట్టొద్దన్నారు. గుడి, బడి, చర్చి, దేవాలయాలు తేడా లేకుండా రేయింబవళ్లు మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. తాటికల్లును కేరళ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. మన రాష్ట్రంలో మాత్రం బీరు, బ్రాందీ, విస్కీలను ప్రోత్సహిస్తూ లక్షలాది గీత కార్మికుల కుటుంబాల ఉపాధిని దారుణంగా దెబ్బతీసిందని నాయకులు గంటా శ్రీరామ్, గోకాడ దేముడు, యర్రా దేముడు, బత్తిన నాగేశ్వరరావు, గండిబోయిన రాము విమర్శించారు. బెల్టు షాపులు తొలగించేందుకు వీఆర్ఏ, సచివాలయ పోలీసు, సర్పంచ్, ఎంపీటీసీలతో గ్రామ కమిటీలు వేయాలన్నారు. బెల్ట్ షాపులు పెట్టిన పంచాయతీల్లో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలంటూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి గర్హనీయం

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత



అనకాపల్లి: కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై కూటమి గుండాలు పోలీసుల సమక్షంలోనే దాడి చేయడం అత్యంత దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయకుండా రెడ్‌బుక్ పాలన సాగిస్తుందని ధ్వజమెత్తారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా ప్రతినిధిపై టీడీపీ, జనసేన పార్టీ గుండాలు మూకుమ్మడిగా దాడి చేయడం హేయమన్నారు. రాష్ట్రంలో ఏదోఒక ప్రాంతంలో మహిళలు, చిన్నారుల పట్ల అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదని విమర్శించారు. ఇదే వైఖరి అవలంబిస్తే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అధికారంలోకి రాకముందు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్ అనేక హామీలు ఇస్తూ, ఆడవాళ్ల జోలికి వస్తే, అదే వాళ్లకు ఆఖరి రోజని, వారి తాట తీస్తామని, అనేక కల్లబొల్లి కబుర్లు చెప్పారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. హోంమంత్రిగా సాక్షాత్తూ ఓ మహిళా ప్రతినిధి ఉండి కూడా రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డంపింగ్ యార్డుతో దుర్వాసన

- విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు వీరుయాదవ్ నిరసన



డంపింగ్ యార్డు వద్ద ప్లకార్డుతో నిరసన తెలియజేస్తున్న వీరుయాదవ్

అనకాపల్లి: పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డును తక్షణమే తొలగించి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద కొనసాగిస్తున్న డంపింగ్ యార్డు వద్ద ప్లకార్డుతో సోమవారం ఆయన నిరసన చేపట్టారు. జీవీఎంసీ జోనల్ అధికారులు అనధికారికంగా 12 ఏళ్లుగా కొనసాగిస్తున్న డంపింగ్ యార్డు తరలించకపోగా.. చికెన్ సెంటర్ల నుంచి తీసుకొచ్చిన కోళ్ల వ్యర్థాలను ఇక్కడే వేస్తున్నారన్నారు. దీనిపై జోనల్ కమిషనర్, సిబ్బంది మీనమేషాలు లెక్కించడం తగదన్నారు. ఇక్కడ డంపింగ్ యార్డు కొనసాగించడమే చట్టవిరుద్ధమన్నారు. తీవ్రమైన దుర్వాసన వెదజల్లడంతో ఉదయం ఐదు గంటల నుంచి ఇళ్లలో ఉండలేకపోతున్నామని వాపోయారు. ఇలాగైతే వ్యాధుల బారిన పడి చనిపోయే పరిస్థితులు నెలకొంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి డంపింగ్ యార్డును తొలగించాలని కోరారు.

మా పిల్లలకు చదువు చెప్పండి సారూ..

- కలెక్టర్ కార్యాలయం వద్ద చిన్నారులు, గిరిజనులు ఆందోళన



కలెక్టర్ కార్యాలయం వద్ద తమ పిల్లలతో ఆందోళన చేస్తున్న గిరిజనులు

కోటవురట్ల: మా ఊర్లో ప్రభుత్వ పాఠశాలను పెట్టండి.. రాకపోకల్లో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.. మా ఊరికి రోడ్డెయ్యండి అంటూ గిరిజనులు ఆందోళన బాట పట్టారు. గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామస్తులు సీపీఎం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సీపీఎం నాయకులు, గిరిజనులు తమ ఆవేదనను వినిపించారు. పీటీజీ కొండు తెగకు చెందిన 50 కుటుంబాలు అణుకులో నివసిస్తున్నాయని, మెయిన్‌రోడ్డు నుంచి తమ గ్రామానికి రావాలంటే గోతులు, గెడ్డలు, బందరాళ్లను దాటుకుని ఆరు కిలోమీటర్లు నడవాలన్నారు. గత ప్రభుత్వంలో గ్రావెల్ రోడ్డు నిర్మించగా, వర్షాల కారణంగా రోడ్డు మొత్తం శిథిలమైందని, దాంతో నడక కూడా నరకప్రాయమే అన్నారు. గర్భిణులు, వ్యాధులతో బాధపడేవారు, బడికి వెళ్లే చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు బడికి వెళ్లాలంటే రానుపోను 16 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని, దాంతో చాలా మంది బడి మానేసి ఇంటికే పరిమితమవుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి తారు రోడ్డు వేసి, గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.డేవిడ్‌రాజ్, గిరిజనులు మర్రి సూరిబాబు, తాంబేళ్ల సూరిబాబు, గెమ్మెల సురేష్, కొర్రా రాజుబాబు, గెమ్మెల సత్తిబాబు, పాంగి ఆశ, తాంబేళ్ల కవిత, గెమ్మెల బంగారమ్మ, తాంబేళ్ల లక్ష్మి, మర్రి చిలుకుచింత పాల్గొన్నారు.

టీడీపీ నేత నుంచి కాపాడండి

- వేరే చోటుకు బదిలీ చేయాలని హెచ్ఎం వేడుకోలు
- ఎంఈవోకు వినతిపత్రం



ఎంఈవో జానుప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న హెచ్ఎం రాము

రోలుగుంట: మండలంలోని అర్ల పంచాయతీలో ఎంపీపీ పాఠశాల హెచ్ఎం బోనెల రాముని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పాడి శ్రీను తరచూ బెదిరిస్తున్నాడు. ఈ నెల 10న పాఠశాలలో పేరెంట్స్, టీచర్ సమావేశంలోనూ అతను రభస చేయడంతో పాటు హెచ్ఎం అంతు చూస్తానంటూ బెదిరించిన విషయం విదితమే. ఈమేరకు హెచ్ఎం ఈ నెల 12న పోలీసులకు, ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఎంఈవో జాను ప్రసాద్ సోమవారం అర్ల పాఠశాలకు వెళ్లి హెచ్ఎంను, స్థానికులను విచారణ చేశారు. శ్రీను నుంచి తనకు ప్రాణహాని ఉందని, వెంటనే తనను పాఠశాల మార్పు చేయాలని ఎంఈవోకు విజ్ఞప్తి చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఎంఈవో తెలిపారు.

రోడ్డు పనులు అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు



స్వాధీనం చేసుకున్న పొక్లెయిన్‌లతో అటవీ అధికారులు



అటవీ అధికారులు అడ్డగింపుతో నిలిచిపోయిన రోడ్డు

- రెండు పొక్లెయిన్‌లు స్వాధీనం
- పోలీసులకు ఫిర్యాదు

మాకవరపాలెం: ఫారెస్ట్ భూమిలో రోడ్డు వేస్తున్నారంటూ అటవీశాఖ అధికారులు రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ పనులకు వినియోగించిన రెండు పొక్లెయిన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాచపల్లి రెవెన్యూలోని 300 ఎకరాల భూమి ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. దీంతోపాటు ఇదే రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో మరో 450 ఎకరాలను పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించనున్నట్టు ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పరిశ్రమలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు యరకన్నపాలెం నుంచి యలమంచిలి మండలంలో జాతీయ రహదారిని కలుపుతూ పెదపల్లికి రోడ్డును సైతం నిర్మిస్తామని ఇటీవల కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం నుంచి రోడ్డు చదును పనులు చేపట్టారు. 40 అడుగులకుపైగా వెడల్పుతో అర కిలోమీటర్ పొడవునా రోడ్డు చదును పనులు పూర్తి చేశారు. దీంతో ఫారెస్ట్ అధికారులు ఈ భూమి తమ దంటూ పనులను అడ్డుకున్నారు. పనులకు వినియోగించిన రెండు పొక్లెయిన్‌లను స్వాధీనం చేసుకున్నామని, మరో రెండు జేసీబీలను బలవంతంగా తీసుకువెళ్లిపోయారని కోటవురట్ల సెక్షన్ అధికారి వివేకానంద సోమవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. రెవెన్యూ అధికారుల ఆదేశాలతోనే రోడ్డు పనులు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారన్నారు. ఈ నేపథ్యంలో అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించే వరకు రోడ్డు పనులు జరగనివ్వమన్నారు. ఆయన వెంట ఫారెస్ట్ బీట్ అధికారి సూరరాజు ఉన్నారు.

ఇష్టం లేని పెళ్లి.. వివాహిత ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: తల్లిదండ్రులు ఇష్టం లేని వివాహం చేశారన్న కారణంతో పట్టణంలోని పాతవీధిలో సలాది రూప (21) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఒక చేతిలో బిడ్డను పెట్టుకుని తల్లి బలన్మరణానికి పాల్పడడం స్థానికులను కలచివేసింది. ఘటనా స్థలాన్ని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, సీఐ ధనుంజయరావు పరిశీలించారు. పట్టణ ఎస్సై కె.సావిత్రి అందజేసిన వివరాలివి.. రాంబిల్లి మండలం పెదకలవలాపల్లికి చెందిన సలాది రూపను నాలుగేళ్ల క్రితం యలమంచిలి పట్టణం పాతవీధికి చెందిన గుంటుకు రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. మొదట్నుంచి రూపకు తల్లిదండ్రులు కుదిర్చిన వివాహం ఇష్టం లేదు. రూప తరచూ తల్లిదండ్రులతో ఈ విషయం చెప్పి బాధపడుతూ ఉండేది. అత్తింటివారు తనను బాగా చూసుకుంటున్నా మానసికంగా తాను ఇబ్బంది పడుతున్నట్టు చెబుతుండేదని మృతురాలి తల్లి నూకరత్నం పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో తన కుమార్తె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు అల్లుడు రాజు, ఇతర కుటుంబసభ్యులు తనకు తెలియజేశారని, విషయం తెలుసుకుని బంధువులతో కలిసి యలమంచిలి వచ్చామని, ఈ మేరకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామని మృతురాలి తల్లి నూకరత్నం తెలిపారు. అత్తింటివారిపై ఎలాంటి అనుమానం లేదని కూడా ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు ఎస్సై సావిత్రి మీడియాకు తెలిపారు.

మాడుగులలో భారీ చోరీ

- ఇంట్లో బీరువా బద్దలు కొట్టి దోపిడీ
- 19.5 తులాల బంగారం, రూ.1.90 లక్షలు నగదు మాయం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, క్లూస్ టీం



లక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు



సంఘటన స్థలంలో క్లూస్ టీమ్ పరిశీలిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: మాడుగుల రాజవీధిలో కోడూరు లక్ష్మి ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు బద్దలు కొట్టి దొంగలు ఇంట్లో ప్రవేశించారు. బీరువాలో 19.5 తులాలు బంగారం, రూ. 1.90 లక్షలు అపహరించారు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తీసి వున్న విషయాన్ని ఇంటి పక్కన్న వున్న వారు లక్ష్మికి సమాచారం ఇవ్వడంతో బాధితురాలు చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ జి.నారాయణరావు, అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ పైడిపునాయుడుతో పాటు క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకుని ఇంట్లో చిందరవందరగా వున్న వస్తువులను పరిశీలించారు. లక్ష్మి కుటుంబ సభ్యులను విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా వుండగా ఈ నెల 1వ తేదీన లక్ష్మి తన కూతురుతో కలిసి మల్కాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. తర్వాత ఇంతవరకు ఆమె ఇంటికి రాలేదని, ఈలోగా ఆదివారం రాత్రి ఈ చోరీ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

అశోక్ గజపతిరాజు నియామకంపై హర్షం

అనకాపల్లి టౌన్: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడంపై అనకాపల్లి క్షత్రియ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నీతి నిజాయితీకి మారుపేరు అయిన అశోక్ గజపతిరాజు ప్రజలకు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సంస్థ ప్రతినిధి పెనుమత్స వెంకటేశ్వరరాజు, పూసపాటి భరత్ బాబు, ఉప్పలపాటి మధు, సుధాకర్ రాజు, వేజర్ల వర్మ, సతీష్ వర్మ తదితరులు ఉన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



జీవీఎంసీ సిబ్బందితో సమీక్షిస్తున్న జెడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జోనల్ కమిషనర్ చక్రవర్తి ఆదేశించారు. సోమవారం స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. పట్టణాభివృద్ధికి ప్రతీ ఉద్యోగి చిత్త శుద్ధితో పనిచేయాలన్నారు. పట్టణంలో సరైన ప్లాన్ లేకుండా ఇష్టానుసారంగా ఇళ్లు కడుతున్నారన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి, తీసుకోబోయే చర్యలపై ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాల సీజన్ కావడంతో ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో వస్తున్న కోళ్ల వ్యర్థాలను ఎప్పటికప్పుడు విశాఖలో డంపింగ్ యార్డుకు తరలించే ఏర్పాటు చేసినట్లు జెడ్సీ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామ ప్రజలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి రజినిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ వర్కింగ్ కమిటీ మాజీ సభ్యుడు అరిజిల్లి అప్పలరాజు కోరారు. ఎంపీడీవో రమేష్‌నాయుడుకు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక టీడీపీ నేత సంతకం లేనిదే ఎలాంటి సర్టిఫికెట్లను జారీ చేయబోమని ఖరాకండీగా చెప్తున్నారన్నారు. అధికారులు విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 110 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	3,700	3,960
మూడోరకం	3,000	3,550

అనకాపల్లి సినిమాలు

రాజా	: సూపర్ మ్యాన్
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: జురాసిక్ వరల్డ్ 3డి వెర్షన్ తెలుగు
పర్తిసాయి	: ఓ భామ అయ్యో రామ
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: వర్జిన్ బాయ్స్
శ్రీ సత్య	: ది 100
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-4, ఓ పాజిటివ్-11, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 336 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

నిర్లక్ష్యం చేస్తే.. తప్పదు భారీ మూల్యం





రేబాక బ్రిడ్జిపై రక్షణగోడ దెబ్బతిన్న ప్రాంతం



ఏఎంఏఎల్ కళాశాల బ్రిడ్జిపై దెబ్బతిన్న ఫుట్‌పాత్

అనకాపల్లి టౌన్: ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణ నష్టం వాటిల్లే వరకు అటు ప్రభుత్వంలోగానీ ఇటు అధికారుల్లోగానీ చలనం రావడం లేదు. పట్టణానికి ఆనుకున్న రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు శిథిలమై కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని ఆందోళన వ్యక్తమవుతోంది. కొద్ది రోజుల క్రితం గుజరాత్‌లోని వడోదర వంతెన కూలిపోయిన ప్రమాదం కలవర పెడుతోంది. ఈ నేపథ్యంలో సబ్బవరం వైపు రేబాక వెళ్లే బ్రిడ్జి, కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలకు వెళ్లే బ్రిడ్జి పరిస్థితి చూస్తే దారుణంగా ఉన్నాయి.

రేబాక బ్రిడ్జిపైనే అధికారులు సైతం రాకపోకలు..

అనకాపల్లి నుంచి రేబాక మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారికి ప్రత్యామ్నాయంగా మరొక జాతీయ రహదారిని నిర్మించారు. ఆ రహదారిపై లారీలు మాత్రమే ప్రయాణిస్తుంటాయి. మిగిలిన ప్రయాణికులంతా అధికంగా ఈ రహదారిపైనే తమ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.

రేబాక సమీపంలో కలెక్టర్ ఆఫీస్‌కు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ బ్రిడ్జిపై వెళుతుంటారు. కలెక్టర్ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులందరూ నిత్యం దీని మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. సబ్బవరం, పెందుర్తి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తుంటాయి. ఈ బ్రిడ్జి రహదారి మొత్తం గోతులమయంగా మారింది. అక్కడక్కడ కొద్దిపాటి మరమ్మతులు చేసినా మరలా తారు లేచిపోయింది. రక్షణ గోడలకు ఏపుగా మొక్కలు పెరిగి వృక్షాలను తలపిస్తున్నాయి. ఇవి ఎప్పటికప్పుడు తొలగించకపోతే, వాటి వేర్లు క్రమంగా బ్రిడ్జి కాంక్రీట్ పునాదుల్లోకి వెళ్ళిపోయే ప్రమాదముంది. దీంతో బ్రిడ్జి బలహీన పడుతుంది. తీగలు బ్రిడ్జి పక్కన గోడలను అల్లేస్తున్నాయి.



రేబాక బ్రిడ్జి రక్షణ గోడలు కనిపించకుండా ఏపుగా పెరిగిన మొక్కలు



రేబాక బ్రిడ్జి మధ్యలో పెరుగుతున్న రావి చెట్టు

కొన్నిచోట్ల గోడలు కూలిపోయాయి. దీంతో అక్కడ గోడ ఉందో లేదో తెలియడం లేదు. మరొక చోట పూర్తిగా ఆరడుగుల మేరకు రక్షణ గోడ దెబ్బతింది. రాత్రి వేళలో వాహనాలు ఇష్టానుసారంగా వెళుతుంటాయి. దీంతో అదుపు తప్పితే వంద అడుగుల మేర పడిపోయే ప్రమాదం ఉంది. అప్పుడు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

బ్రిడ్జిని బాగు చేయాలి



రేబాక బ్రిడ్జిపై ప్రయాణించాలంటే భయమేస్తోంది. రాత్రి వేళలో మొక్కల వల్ల రక్షణ గోడలు కనిపించడం లేదు. దాంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. తక్షణమే బ్రిడ్జిపై మొక్కలను తొలగించాలి. బ్రిడ్జిని బాగు చేయాలి. -ఎం అరుణ్ కుమార్, రేబాక

అధిక లోడ్ లారీలను నియంత్రించాలి



ఏఎంఏఎల్ కళాశాల బ్రిడ్జిపై కొద్దిపాటి మరమ్మతులు చేశారు. కురుస్తున్న వర్షాలకు తారు లేచిపోతోంది. పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలి. లేకపోతే బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉంది. డివైడర్‌పై నడిచేందుకు వీలు లేదు. అధిక లోడ్‌లతో వెళుతున్న లారీలను నియంత్రించాలి. - పీఎస్‌ఈ హుస్సేన్, బీఆర్టీ కాలనీ

ఏఎంఏఎల్ కళాశాల రోడ్డు బ్రిడ్జిదీ అదే తంతు...



ఏఎంఏఎల్ కళాశాల బ్రిడ్జిపై కనిపిస్తున్న ఇనుప ఊచలు

కొత్తూరు పంచాయతీ పరిధిలోని కాలేజీ రోడ్డు వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి మీదుగా అనకాపల్లి సమీప గ్రామాల ప్రజలు, అటు చోడవరం నుంచి దూరం కలిసి వస్తుందని పలు గ్రామాల నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. విద్య, ఉపాధి, వ్యాపార పనులపై వేలాది మంది పట్టణానికి వచ్చిపోతుంటారు. పంటలకు అవసరమైన ఎరువులు, ఇతర సామగ్రి కొనుగోలు కోసం వస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ పలకలు ధ్వంసమయ్యాయి. బ్రిడ్జి మధ్యలో రైలు ప్రదేశంలో ఇనుప ఊచలు పైకి లేచిపోయి ఉన్నాయి. ఫుట్‌పాత్‌పై కంకరతో కూడిన ఇసుక కుప్పలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని పలు గ్రామాల్లో కశింకోట బంగారుమెట్ట రోడ్డులో పలుచోట్ల రాయి, మెటల్ క్వారీలు ఉన్నాయి. పరిమితికి మించి బరువుతో టిప్పర్లు, లారీలు ఈ వంతెనపై వెళుతుంటాయి. దీంతో వంతెన త్వరగా ధ్వంసమవుతోంది. నిత్యం బ్రిడ్జి నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ మీదుగా ఈ వాహనాలు అన్నీ అధిక లోడులతో పోతుంటాయి. అయినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. తక్షణమే భారీ వాహనాల రాకపోకలు నియంత్రించకపోతే వంతెన కూలిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇక వర్షాలు పడితే గోతులు కనిపించవు. ద్విచక్ర వాహనదారులు ఆ గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం. తక్షణమే బ్రిడ్జిలను బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

త్వరలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలు



రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్



కంపోస్టు యార్డు దుర్వాసనతో ముక్కులు మూసుకుని చదువుకుంటున్న జీవీఎంసీ పెద్ద హైస్కూల్ విద్యార్థులు



హైస్కూల్ ఉపాధ్యాయినితో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

- నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో గ్రామీణ స్థాయి నుంచి కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు వద్ద క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో దగాకోరు హామీలతో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది పూర్తయినప్పటికీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రజల్లో చైతన్యం చేసి పథకాలను అమలు చేసే వరకూ వైఎస్సార్‌సీపీ నాయకులు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పాలనకు, కూటమి పాలనకు ప్రజల్లో వ్యత్యాసం కనిపించిందన్నారు. ప్రజలు సైతం మన పక్షాన నిలబడి పోరాటాలకు సిద్ధంగా ఉన్నారన్నారు. కరోనా కష్టకాలంలోనూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేయడంలేదో అధికార పార్టీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలో గాంధీబొమ్మ జంక్షన్ నుంచి పెరుగు బజార్ జంక్షన్ వరకూ రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80, 84 వార్డుల ఇన్‌చార్జులు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, పార్టీ నాయకులు దాడి నారాయణరావు, మునూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు తరలించాలని జీసీకి భరత్‌కుమార్ ఫోన్

పట్టణంలోని 83వ వార్డు స్థానిక మెయిన్‌రోడ్డులో జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ప్రహరీని ఆనుకుని అధికారులు ఏర్పాటు చేసిన కంపోస్టు యార్డు వల్ల విద్యార్థులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరు వ్యాధులు బారినపడే ప్రమాదముందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ ఆధ్వర్యంలో ఆయన కంపోస్టు యార్డును పరిశీలించారు. అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. పెద్ద హైస్కూల్‌తోపాటు జూనియర్ కళాశాల విద్యార్థులు ముక్కులు మూసుకుని తరగతి గదుల్లో కూర్చోనే పరిస్థితి నెలకొందని వాపోయారు. మధ్యాహ్న భోజనం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కంపోస్టు యార్డును తొలగించాలని జోనల్ కమిషన్ చక్రవర్తితో ఫోన్లో కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశం రేపు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో అరబిందో కల్యాణ మండపంలో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. దగాకోరు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఏడాది పాలన పూర్తయినా సూపర్ సిక్స్ అమలు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని 'రీ కాలింగ్ చంద్రబాబూ మ్యానిఫెస్టో' పేరిట ప్రజల్లోకి తీసుకెళ్లడానికిగాను పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులను చేయడానికి సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, జిల్లా పార్టీ కమిటీ, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అదుపు తప్పి బండరాళ్ల లారీ బోల్తా

లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



గాయపడిన లారీ డ్రైవర్ దేవుళ్లునాయుడు



క్లీనర్ వంశీ



తాళ్లపాలెం సంత వద్ద బోల్తా పడిన రాళ్ల లారీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. రోలుగుంట నుంచి అనకాపల్లి వైపు బండరాళ్లు తీసుకెళ్తున్న లారీ తాళ్లపాలెం సంత వద్ద మలుపు తిరుగుతూ అదుపు తప్పి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. దీంతో డ్రైవర్ హెచ్. దేవుళ్లనాయుడు, క్లీనర్ వంశీ గాయపడ్డారు. స్థానికులు వీరిని లారీ క్యాబిన్ నుంచి వెలికి తీసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందారు. ఈ ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లేదంటే ప్రాణహాని జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు



గాలిభీమవరంలో గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను అడ్డుకుంటున్న ఎస్ఐ దివ్య, పోలీసులు

సబ్బవరం: మండలంలోని వుడా డెవలప్‌మెంట్ ప్లాట్ల(జగనన్న అర్బన్ హౌసింగ్ లేఅవుట్)లో చేపడుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలను సబ్బవరం పోలీసులు అడ్డుకున్నారు. గాలిభీమవరం రెవన్యూ పరిధి సర్వే నెం.61లో మునగకొండ కొండవాలు ప్రాంతంలో గతంలో జగనన్న అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌ను వేశారు. ఇక్కడ ఎలాంటి అనుమతుల్లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంతో స్థానికులు కొందరు నేరుగా పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ దివ్య తన సిబ్బందితో కలిసి గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న ప్రదేశాన్ని పరిశీలించి, తవ్వకాలను అడ్డుకోన్నారు. అనుమతుల్లేకుండా గ్రావెల్, మట్టి తవ్వకాలు, తరలింపు నేరమని, అనుమతులుంటే చూపాలన్నారు. అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌లో ల్యాండ్ పూలింగ్‌లో తమకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేసుకుంటున్నట్లు తవ్వకాలు జరుపుతున్నవారు బదులిచ్చారు. వారి వద్ద అనుమతుల్లేకపోవడంతో గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేసి, అక్కడ నుంచి పోలీసులు వెనుదిరిగారు.

లలితా సహస్ర నామ పారాయణం



లలితా సహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళలు

కశింకోట: స్థానిక గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో మహిళలు చేపట్టిన లలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమం సోమవారానికి 9వ రోజుకు చేరింది. దీన్ని మండల దీక్షగా ఆషాఢ మాసం తొలి ఏకాదశి రోజు కలశం ఏర్పాటు చేసి చేపట్టారు. ఈ సందర్భంగా లలితా సహస్ర నామ పారాయణ సంప్రదాయంగా నిర్వహించారు. భక్తి పాటల ఆలాపనతో భజన కార్యక్రమం నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిపారు.

సిగ్నల్ లైట్ల పని వేళలపై వినతి

అనకాపల్లి టౌన్: పట్టణంలో నాలుగు రోడ్ల జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు పని వేళలను కుదించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు పేర్కొన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేశారు. నాలుగు రోజుల నుంచి ఎండలు తీవ్రమైనందు వల్ల మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు సిగ్నల్ లైట్లు నిలుపుదల చేయాలన్నారు. ఆ సమయంలో ఎక్కువగా ఆస్పత్రికి వెళ్లేవారు సిగ్నల్ పాయింట్ దగ్గర ఆగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

పల్లపు ఆనందపురంలో వృద్ధురాలి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురం గ్రామానికి చెందిన వృద్ధురాలి మృతిపై మునగపాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రసాదరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రి జోగమ్మ(60) ఒంటరిగా జీవనం సాగిస్తూ రోజువారీ కూలీ పనులు చేసుకుంటోంది. సోమవారం ఉదయం 10 గంటలు కావస్తున్నా, ఆమె ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు అటువైపుగా వెళ్లి చూడగా చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న మృతురాలి సోదరుడు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. మృతురాలి శరీరంపై బయటకు కనిపించే గాయాలు లేవని చెప్పారు. మంగళవారం జోగమ్మ మృతదేహానికి పంచనామా నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగిస్తామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.